www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య కొప్పిరెడ్డి పద్మరాజు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య గోడి సుధాకర్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 4 సంచిక : 34 20-05-2024 పుటలు : 4



## నన్నయ వర్సిటీ అభివృద్ధిలో
# న్యూయోమ్ టెక్నాలజీస్ సహకారం

న్యూయోమ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ బెంగళూరు సహ వ్యవస్థాపకుడు, సీఈఓ అండ్ ఎండీ డా.వంగల రజనీకాంత్ తో ఆదికవి నన్నయ యూనివర్సిటీ అధికారులు సమావేశమయ్యారు. యూనివర్సిటీ ఈసీ హాల్ లో జరిగిన సమావేశంలో యూనివర్సిటీ మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం న్యూయోమ్‌తో సహకారం యొక్క సాధ్యత గురించి చర్చించారు. వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ న్యూయోమ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ బెంగళూరుతో కలిసి తదుపరి తరం విద్యార్థుల అభ్యాస కార్యక్రమాలు, వ్యవస్థాపకత మరియు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మిషన్ లెర్నింగ్ ని వ్యవసాయం,మత్స్య పరిశ్రమ మరియు ఆరోగ్య సంరక్షణలో సమగ్రపరిచే ఆవిష్కరణల కోసం అత్యుత్తమ సెంటర్‌ను రూపొందించడంలో కలిసి పని చేయబోతున్నామన్నారు. విద్యార్థులకు సాధికారత కల్పించడం, మహిళా విద్యార్థులు మరియు పారిశ్రామికవేత్తలపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. గోదావరి జిల్లా వాసిగా సీఈఓ డా.వంగల రజనీకాంత్ సహృదయంతో ముందుకు వచ్చారని అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్లేస్మెంట్ ఆఫీసర్ ఆచార్య బి.జగన్మోహనరెడ్డి,సిడిసీ డీన్ ఆచార్య కె.శ్రీరమేష్ విశ్వవిద్యాలయ అధికారులు పాల్గొన్నారు.

# బీఈడీ పుస్తకాన్ని ఆవిష్కరించిన వీసీ పద్మరాజు



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యాకళాశాల సహాయాచార్యులు డా.ఎం.గోపాలకృష్ణ వ్రాసిన పుస్తకాన్ని వీసీ ఆచార్య కె.పద్మరాజు ఆవిష్కరించారు. గురువారం యూనివర్సిటీ ఈసీ హాల్ లో పుస్తకాన్ని ఆవిష్కరించిన వీసీ సహ రచయిత డా.ఎం.గోపాలకృష్ణను అభినందించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు మరియు సంస్కృత అకాడమీలో బీఈడీ మొదటి సంవత్సరానికి చెందిన భౌతిక రసాయన శాస్త్ర బోధనాభ్యసన శాస్త్రం 1 అనే పుస్తకాన్ని ఆవిష్కరించామని వీసీ తెలియజేసారు. రచయిత డా.ఎం.గోపాలకృష్ణ మాట్లాడుతూ పుస్తక రచనకు సహకరించిన విశ్వవిద్యాలయ అధికారులకు, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలియజేసారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్,అధ్యాపక మిత్రులు పుస్తక రచయిత డా.ఎం.గోపాలకృష్ణ ను అభినందించారు.



# సంతోషిదేవికి పిహెచ్‌డి పట్టా ప్రదానం

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కంప్యూటర్ సైన్స్ లో అరిగెల శ్రీ సంతోషిదేవికి వీసీ ఆచార్య కె. పద్మరాజు పీహెచ్.డి.డిగ్రీని ప్రదానం చేశారు. సిఎస్ఇలోని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.పెర్సిస్ మార్గదర్శకత్వంలో "కళాశాల మరియు విశ్వవిద్యాలయ స్థాయిలలో విద్యార్థుల బదిలీల ధ్రువీకరణ కోసం బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ సొల్యూషన్ పని తీరు" అనే అంశంపై సంతోషి దేవి పరిశోధన చేశారు. ఈ సాంకేతిక పరిశోధన ద్వారా భద్రతతో పారదర్శకంగా సర్టిఫికెట్లు అందుతాయని తెలియజేశారు. రిజిస్ట్రార్ ఆచార్య జి సుధాకర్, అధ్యాపక బృందం డా. శ్రీ సంతోషిదేవిని అభినందించారు.

# ఎన్నికల కారణంగా జూన్ 6 వరకు నన్నయ వర్సిటీ కార్యకలాపాలు నిలుపుదల



ఎన్నికల కారణంగా తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ సూచనల మేరకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని రోజు వారి కార్యక్రమాలను జూన్ 6వ తేదీ వరకు నిలుపుదల చేసామని వీసీ ఆచార్య కె పద్మరాజు తెలియజేశారు. శనివారం యూనివర్సిటీ ఈసీ హాల్లో విశ్వవిద్యాలయ అధికారులతో విసి సమీక్షించారు. వీసీ మాట్లాడుతూ ఈవీఎంలు మరియు ఇతర ఎన్నికల పత్రాలు మరియు ఓట్ల లెక్కింపు కోసం కౌంటర్ల, స్ట్రాంగ్ రూమ్స్ ఉన్న కారణంగా యూనివర్సిటీ క్యాంపస్ ను "నో మ్యాన్స్ జోన్" గా ఎన్నికల కమిషన్ మరియు జిల్లా కలెక్టర్ ప్రకటించారని తెలిపారు. కావున విశ్వవిద్యాలయ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు సహకరించాలని సూచించారు.

# సంపాదకీయం



# అన్నమయ్య

కవిత్వం పుట్టింది మనిషిలోని జంతు ప్రకృతిని అంతం చేయటానికే.కవిత్వం శాఖోపశాఖలైంది కూడా ఈ ప్రయోజనం కోసమే.

పద,పద్య కవితల్లో పదమే ముందు పుట్టిందనే విషయం సర్వపండితామోదం పొందింది. పదాన్ని నిబద్ధం చేసి పదకవితా వైభవాన్ని పరిమళభరితం చేసిన ఘనత తాళ్లపాక అన్నమాచార్యులదే.పెద తిరుమలాచార్యులు, క్షేత్రయ్య, సారంగపాణి, రామదాసు, త్యాగరాజు మొదలైన పదకవుల చేతిలో వివిధ రీతుల్లో మార్పులు చెంది సాహిత్యం సంగీత సామ్రాజ్యంలో,అభినయంలో పదకవితగా పరవశించింది.

అన్నమయ్య ద్రావిడాగమ సార్వభౌముడు.రాయలసీమలో ప్రభవించిన దివ్యరత్నం.పుట్టింది కడపజిల్లా తాళ్లపాక. మెట్టింది తిరుపతి పుణ్యక్షేత్రం. కలియుగ వైకుంఠేశ్వరుడైన శ్రీవెంకటేశ్వర స్వామిని సంకీర్తనలతో పూజించి, సేవించి,తరించిన వాగ్గేయకారుడు. ప్రపంచ చరిత్రలోనే ఒక వ్యక్తి చేతిమీదుగా ఇన్ని వేల సంకీర్తనలు వెలువడటం చాలా అరుదైన విషయం.అన్నమయ్య తెలుగువాడు కావటం మన అదృష్టం. ఆయన స్పృశించని విషయం లేదు. వివరించని వ్యవహారం లేదు. తవ్వుతున్న కొద్ది తరగని గని.మాటలామరి.ముప్పైరెండు వేల సంకీర్తనలు.

జానపద గేయాలు మనిషి ఉద్విగ్న హృదయం నుంచి మధురంగా జాలువారే రసగుళికలు. ఆ గేయరీతుల్లోనే పదకవిత్వమంతా సాగింది. అటువంటి కవిత్వానికే నాంది పలికాడు అన్నమయ్య. అందుకే ఆ కీర్తనలన్నీ సామాన్యులు హాయిగా ఆనందంగా పాడుకోవడానికి వీలుగా ఉంటాయి.అవన్నీ ఆశువుగా పుట్టినవే. అందుకే అవి అంత సహజ సుందరంగా భాసిస్తాయి. అన్నమయ్య కీర్తనలు భక్తి తత్వాన్నే కాకుండా లోకజ్ఞతను, సామాజిక చైతన్యాన్ని, ప్రణయ సౌందర్యాన్ని, హితోక్తుల్ని, తల్లిలాలనల్ని, సామరస్య గుణాన్ని,స్త్రీవాద తత్వాన్ని ముఖ్యంగా మూఢాచారాల్ని ఖండించిన విధానాన్ని ప్రబోధిస్తాయి.నిర్వికార ప్రవృత్తి,వినయ సంపత్తి, నిష్కలంక భక్తి సహృదయ లోకానికి దర్శనమిస్తుంది.

కులంవల్ల గర్వం, పంతంవల్ల జగడం,ధనం వల్ల లోభం, విద్య వల్ల అహంకారం, స్త్రీ సంబంధాల వల్ల తాపాలు, సంపద వల్ల చింతలు కలుగుతాయి కానీ సుఖం లేదని, దైవభక్తే నిజమైన సుఖమని ఇంతకు మించిన సత్యం ఇంకేమీ లేదని జ్ఞాన బోధ చేశాడు. మనిషి తనకు అన్నీ తెలిసినందుకు జయశీలుడు కావాలని, జీవిస్తున్నందుకు ఫలం దయకలిగి ఉండాలని, శరీరం ఉన్నందుకు మేలు చేయాలని, మానవత్వం కలిగినందుకు మంచివాడుగా ఉండాలని, తత్వపరుడు కావాలని, చదువుకున్నందుకు పురుషార్థాల సారాన్ని తెలుసుకోవాలని, శాస్త్ర సారాంశాన్ని గ్రహించినందుకు దైవభక్తిని కలిగి ఉండాలని అప్పుడే వీటన్నింటికీ ఫలితం ఉంటుందని లేకపోతే ప్రయోజనమే లేదని హిత బోధ చేసి ఏది మంచో వివేకులైన మీరే విచారించుకోవాలని హెచ్చరించాడు.మనకు ఆ మాటలు ధైర్యం, ఉత్సాహం, ప్రశాంతత కలిగించి కర్తవ్యోన్ముఖుల్ని చేస్తాయి.

సమాజంలో అనేక రకాల మనస్తత్వాలు కలిగిన మానవాళిని ఉద్ధరించి, తరింపచేయటం కోసమే అన్నమయ్య భిన్నరీతుల్లో కీర్తనలు రాశాడు. అందులో సత్యాలు ఆ కాలం వారికే కాకుండా నేటికీ, రాబోయే తరాలకు ఆమోదయోగ్యంగా, ఆచరణీయంగా ఉన్నాయి. ఆయన సంకీర్తనలు నిత్య సుగంధ సంభరిత పారిజాత సుమాలు.
అన్నమయ్య తెలుగు పద సాహిత్య క్షీరాబ్ధిలో రాజహంస!!

*(మే 23 అన్నమయ్య జయంతి)*


## టంగుటూరి ప్రకాశం పంతులు గారి వర్ధంతి (మే 20)





రండిరా! ఇదే కాసుకొండిరా! అని నిండు గుండెలిచ్చిన మహోద్దండ మూర్తి.... టంగుటూరి.
చిలకమర్తి వారు రచించిన గయోపాఖ్యానం నాటకంలో మొదటి అంకంలో చిత్రరేఖ స్త్రీ పాత్ర, మూడవ రంగంలో వీరోచితమైన అర్జునుని పాత్ర పోషించిన సందర్భాలు అజరామరమైనవి.
ఇంగ్లాండ్ వెళ్లి బారెట్ లా చదివి ఆంధ్రదేశంలో న్యాయవాద వృత్తిలో ప్రసిద్ధుడైన గొప్ప వ్యక్తి.
సమస్తాన్ని త్యాగం చేస్తూ జాతీయోద్యమంలో చురుకుగా పాల్గొన్న నిస్వార్థ దేశభక్తుడు.
భాషా ప్రయుక్త రాష్ట్రాలుగా ఏర్పడినప్పుడు ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా సేవలందించిన మహనీయుడు.
రాజమహేంద్రవరం టంగుటూరి ప్రకాశం పంతులు గారిని కోటగుమ్మం సెంటర్లో నిలువెత్తు విగ్రహంగా ప్రతిష్ఠించుకుంది.
రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలలో నాటి ప్రిన్సిపాల్ మెట్ కాఫ్ దొరకు ప్రియ శిష్యుడుగా పేరు తెచ్చుకున్నారు గొప్ప విద్యార్థి.
ఆయన రచించిన "నా జీవిత యాత్ర"తప్పనిసరిగా చదవదగిన పుస్తకం కష్టాల కొలిమిలోంచి గొప్ప బంగారంగా ఎదిగిన మనిషి జీవిత చరిత్ర అది.
వారికి నన్నయవాణి ఘన నివాళిని అర్పిస్తుంది.

**- సంపాదకుడు**











## చిత్రకళా నీరాజనం

### - ఎస్ హరిత

ఎంఎస్సీ
బయోటెక్నాలజీ
ఆదికవి నన్నయ
యూనివర్సిటీ
రాజమహేంద్రవరం







# ఉత్తర అమెరికా తెలుగు సంఘం

**( నెలనెలా తెలుగు వెలుగు)**

**తానా ప్రపంచ సాహిత్య వేదిక 4వ వార్షికోత్సవం ది.19.5.2024**

**అంశం: ప్రజాభ్యుదయంలో సాహిత్యం, కళల పాత్ర: నాడు - నేడు**

**ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు గారి సందేశ సారాంశం:**

**నెలనెలా తెలుగు వెలుగు ను ప్రపంచానికి ప్రసరింపచేస్తున్న ఉత్తర అమెరికా తెలుగు సంఘం వారికి నమస్కారాలు తెలియజేస్తున్నాను.**

**తానా ప్రపంచ సాహిత్య వేదిక నాలుగవ వార్షికోత్సవం కార్యక్రమానికి శుభాకాంక్షలు.**



సాహిత్యం, కళల యొక్క పాత్ర ఒకప్పుడు ఎలా ఉంది, ఇప్పుడు ఎలా ఉంది అనే అంశం మీద మంచి సాహిత్య సదస్సును నిర్వహిస్తున్న మీ అందరికీ శుభాకాంక్షలు. సాహిత్యం, కళలు సమాజంలో ఆంతరికంగా ప్రవహించే ఒక జీవశక్తి. అవి నిరంతరం సమాజానికి దిశా నిర్దేశం చేస్తూనే ఉంటాయి.సమాజం ఎలా ఉండకూడదో, ఎలా ఉండాలో మనిషికి ప్రబోధాన్నిస్తాయి.

కళలు మానసికమైన ఆనందాన్నే కాకుండా అంతర్లీనమైన ప్రబోధాత్మక సందేశాన్ని అందిస్తూ ఉంటాయి. ఆ దిశగా కవులు కళాకారులు నిరంతరం నిస్వార్థంగా ఈ సమాజానికి సేవలు అందిస్తూనే ఉంటారు.

ఆదికవి నన్నయ గారి దగ్గరనుంచి వెయ్యేళ్ళ సాహిత్య చరిత్ర మనకి ఉంది. ఎన్నో కావ్యాలు, గీతాలు, కవితలు ఈ సమాజానికి ప్రబోధాత్మకంగా సందేశాన్నిచ్చాయి.

వెయ్యేళ్ళ క్రితం నన్నయ గారు "జగద్ధితంగా" నేను ఈ రచన ప్రారంభిస్తున్నాను అన్నారు మహాభారత అవతారికలో. అంటే సమాజం కోసమే నేను ఈ రచన చేస్తున్నాను అని చెప్పారు. దానికి ప్రేరణ ఇచ్చిన మహారాజుని ప్రస్తావించారు. ఒక ప్రణాళికను రచించి తర్వాత కవులకు మార్గదర్శకమయ్యారు. తెలుగు భాషా సాహిత్యాలకు మార్గదర్శకుడుగా నిలిచారు.

అటువంటి మహాకవి పేరు మీదుగా రాజమహేంద్రవరంలో గోదావరి జిల్లాల కోసం వెలసిన ఒక విద్యా సంస్థ "ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం."అటువంటి విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా సేవలు అందించే అవకాశం నాకు లభించినందుకు ఎంతో సంతోషిస్తున్నాను.

ఈనాటి ఈ సదస్సులో పాల్గొంటున్న ముఖ్య అతిథులకు కళాకారులకు నేను వినయ పూర్వకంగా నమస్కరిస్తూ ముఖ్యంగా సుద్దాల అశోక్ తేజ గారు, గోరటి వెంకన్న గారు, అందెశ్రీ గారు మా విశ్వవిద్యాలయానికి విచ్చేసి జానపద సాహిత్యం, కళలు, కవిత్వం ఈ అంశాల గురించి చాలా చక్కని ఉపన్యాసాలు ఇచ్చారు. వారి ఉపన్యాసాలను విశ్వవిద్యాలయం నన్నయ్య టీవీ ద్వారా భద్రపరిచింది కూడా. విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖ ఏర్పడిన తర్వాత ఈ 13 ఏళ్లలో సుమారుగా ఇప్పటికి 30 పైనే జాతీయ అంతర్జాతీయ సదస్సులను నిర్వహించడం జరిగింది. ఎంతోమంది కవులు, సినీ గీత రచయితలు, కళాకారులు విశ్వవిద్యాలయానికి విచ్చేసి తమ సందేశాల్ని అందించారు. ఇటీవల రాజరాజ నరేంద్ర, నన్నయ మహాభారత ఉత్సవాలను కేంద్ర సాహిత్య అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించుకున్నాం. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్తలంతా మా నన్నయ విశ్వవిద్యాలయ వేదిక మీద అద్భుతమైన సందేశాలను ఇచ్చారు.

రాజమండ్రిలో ఉన్న ఎంతోమంది ఉద్దండులైన తెలుగు పండితులు, తెలుగు రాష్ట్రాల్లోని చాలామంది ప్రముఖులు తమ వద్ద ఉన్న విలువైన సాహిత్య గ్రంథాలను నన్నయ విశ్వవిద్యాలయ కేంద్ర గ్రంథాలయానికి బహూకరించారు. అలా బహూకరించిన సుమారుగా 15 వేల గ్రంథాలతో "నన్నయ భారతి"అనే ఒక ప్రత్యేక విభాగాన్ని విద్యార్థులకు, పరిశోధకులకు ఎంతగానో ఉపయోగపడేలాగా తీర్చిదిద్దుకున్నాం.ప్రస్తుతం అనేకమైన కోర్సులతో, భవన నిర్మాణాలతో వివిధ గుర్తింపులతో వివిధ అవగాహన ఒప్పందాలతో నన్నయ విశ్వవిద్యాలయం క్షణక్షణాభివృద్ధి చెందుతుందని మీకు తెలియజేస్తున్నందుకు సంతోషిస్తున్నాను.

సాహిత్యం, కళారంగం, లలిత కళలు లేకపోతే మనిషి జీవితం నిస్సారమైంది. నిరంతరం శ్రమించే మనిషి ఊరట చెందటానికి, ప్రశాంతమైన ఆరోగ్యాన్ని పొందటానికి లలిత కలలు ఎంతో దోహదం చేస్తాయి. ముఖ్యంగా సాహిత్యం... అది కవిత్వం, కథ, నవల, పాట...ఇలా ఏ రూపంలో ఉన్నా మనిషిని తీర్చిదిద్దుతూ ఉంటుంది. వైతాళికుడిలా మేలుకొలుపుతుంది. గురువులా ప్రబోధిస్తుంది. ఇంక... కళా రంగం అయితే మనసుకు ఆనందాన్ని కలిగిస్తాయి. ప్రదర్శక కళలే ఒకనాటి సమాజాన్ని తీర్చిదిద్దాయి. సాంకేతిక నాగరికత ద్వారా వాటిని మళ్ళీ మనం సమాజానికి అందించగలుగుతున్నాం. బహుశా మన ఊళ్లో, మన వీధిలో వాటిని ప్రదర్శించలేకపోవచ్చు. అటువంటి నేపథ్యం ఇప్పుడు వీలు కాకపోవచ్చు. కానీ వాటన్నిటినీ మనం స్మార్ట్ ఫోన్ ద్వారా, మీడియా ద్వారా మనం ప్రత్యక్షంగా చూడగలుగుతున్నాం. ఒక విధంగా ఒకనాటి కళలు అంతరించిపోకుండా వాటిని బ్రతికించటానికి సాంకేతిక పరిజ్ఞానం మనకు బాగా ఉపయోగపడుతుందని నేను అనుకుంటున్నాను.




నన్నయ్య గారి దగ్గర నుండి ఈనాటి వరకు ఈ వేయి సంవత్సరాల సాహిత్య ప్రస్థానంలో ఆయా కాలాలకు తగిన అనేకమైన ప్రక్రియల్లో కవిత్వం సమాజాన్ని ప్రతిబింబిస్తూ వచ్చింది. ఆయా కాలాలకు తగిన అవసరాలకు, సమాజాన్ని తీర్చిదిద్దడానికి కవులు వివిధ ప్రక్రియలను ఎన్నుకున్నారు. పద్యం, గేయం, యక్షగానం, ప్రబంధం, నాటకం, నవల, కథ, పాట, ఇప్పుడు ప్రస్తుతం వస్తున్న గజల్స్, మినీ కవితలు, హైకూలు, నానీలు వంటి ప్రక్రియలు సమాజాన్ని తీర్చిదిద్దటానికి, మనిషి మీద ప్రభావాన్ని చూపించటానికి కొత్త కొత్త రూపాలలో కవిత్వం వస్తూనే ఉంది. ఇంక... ప్రదర్శన కలలు, నాటక రంగం, అలాగే లలిత కళలు ఒకనాటికన్నా ఇప్పుడు ఇంకా ఆధునిక సాంకేతిక సౌకర్యాలను వినియోగించుకుంటూ మరింత అందంగా మన ముందు ఉన్నాయి. చిత్రలేఖనంలో అనేకమైన కొత్త కోణాలు గ్రాఫిక్స్ ద్వారా మనం చూడగలుగుతున్నాం. అలాగే సినిమా రంగం కూడా.

అయితే కళా రంగం విషయంలో ఒకనాడు ప్రదర్శింపబడిన కొన్ని కళలు ఈనాడు మనకవి అవసరం లేకపోవచ్చు. అవి ప్రదర్శించడానికి నేపథ్యం లేకపోవచ్చు. అయినప్పటికిని వాటిని కూడా మనం భద్రపరుచుకుని ఇటువంటి కళలు ఉండేవని మనం చూపించగలుగుతాం. కాలాన్ని బట్టి ప్రతి అంశం మారుతూ ఉంటుంది. కొన్ని అంతరిస్తూ ఉంటాయి. కొన్ని కొత్తవి ఆవిర్భవిస్తూ ఉంటాయి అన్నిటికీ మనం స్వాగతం పలకాల్సిందే.

ఏదేమైనా వీటి గురించి ఒక పునరాలోచన చేయడానికి ఈనాటి ఈ అంతర్జాల సాహిత్య వేదిక ఎంతగానో ఉపయోగపడుతుందని నేను భావిస్తున్నాను మంచి అంశం మీద ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులకు పాల్గొంటున్నటువంటి అతిథులు, కళాకారులు అందరికీ మరొక్కసారి నేను శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

ఈ ముఖ్యమైన సదస్సులో నన్ను కూడా భాగస్వామ్యం చేసినందుకు నేను మీ అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

**నమస్కారం!!**

# ఆంధ్రుల అన్నపూర్ణమ్మ డొక్కాసీతమ్మ

**సేవావాణి**

తూర్పు గోదావరి జిల్లా కోనసీమలో లంకల గన్నవరంలో డొక్కా సీతమ్మ గారు అని ఒక మహాతల్లి ఉండేవారు. ఆవిడ పేరు మీద ఆక్విడెక్ట్ కూడా కట్టారు. ఆవిడ గొప్ప నిరతాన్నదాత.

వచ్చిన వాళ్లకి లేదనకుండా అన్నం పెట్టేవారు. ఆవిడ ధృతి, దీక్ష ఎంత గోప్పవంటే – ఆవిడ జీవితములో ఒకేఒక్కసారి అంతర్వేది లక్ష్మి నరసింహ స్వామి దర్శనానికని బయలుదేరారు. బయలుదేరి, గోదావరి వంతెన వద్ద పల్లకి ఆపారు.

**ఆవిడ పల్లకిలో కూర్చునారు, బోయీలు**

అలసిపోయి గట్టు మీద కూర్చున్నారు. అటుగా పి.గన్నవరం వైపు వెళ్ళిపోతున్న ఒక బృందంలో పిల్లలు ఆకలి అని ఏడుస్తుంటే, పెద్దవాళ్ళు "ఒక్క అరగంట లో గన్నవరం వెళ్లిపోతాం.

అక్కడ సీతమ్మ గారు మనకు అన్నం పెడతారు" అని మాట్లాడుకోవటం విన్నారు సీతమ్మగారు. వెంటనే ఆవిడ అంతర్వేది వెళ్ళటం మానేసి, పల్లకి వెనక్కి తిప్పెయ్యండి. వీళ్ళకి అన్నం పెట్టాలి అని వెనుకకు వెళ్ళిపోయారు. అంతటి నిరతాన్న దాత ఆవిడ.



ఆఖరికి ఆవిడ పరిస్థితి ఎక్కడికి వెళ్లిపోయిందంటే, అందరికీ పెట్టి పెట్టి, ఆ దంపతులకి తినటానికి ఏమీ లేకుండా పోయింది. ఒకానొకప్పుడు ఆవిడ భార్తగారు "ఎందుకు ఇంకా ఈ అన్నదానం? మనకి కూడా తినటానికి ఏమీ లేదు.

వచ్చి ఎవరైనా తలుపుకొడితే సిగ్గేస్తోంది! పెట్టడమా మానవు! ఇంత అన్నం పప్పైనా పెడతావు" అన్నారు. దానికి ఆవిడ "నేను నిస్వార్థముగా పెట్టేటప్పుడు, వచ్చిన వారు తింటున్నప్పుడూ వచ్చినదీ, తింటున్నదీ శ్రీ మహా విష్ణువని నమ్మి పెట్టాను.

ఎవరిని నమ్మి నేను పెట్టానో వాడు పెట్టే చేతిని ఎందుకు నరికేస్తాడు? మనకీ వాడే పెడతాడు" అని చెప్పి పెట్టింది. ఇన్నాళ్ళ నుంచీ దున్నుతున్న అదే పొలానికి వెళ్లి సీతమ్మ గారి భర్త ఒక రోజు సాయంకాలం గొయ్యి తవ్వుతున్నారు. గునపానికి ఏదో తగిలి ఖంగుమంది.

ఆయన మట్టి తీసి చూస్తే ఒక బిందె కనపడింది. బిందె మూత తీస్తే, దాని నిండా బంగారు నాణాలే. తీసుకొచ్చి ఇంట్లో బంగారు కాసుల రాశులు పోసి, మళ్లీ రొజూ కొన్ని వందల మందికి అన్నదానం చేసారు.

ఆశ్చర్యం ఏమిటంటే బ్రిటిష్ చక్రవర్తి తూర్పు గోదావరి జిల్లా కలక్టరుకి డొక్కా సీతమ్మ గారి ఫోటో తీసి పంపించమని ఉత్తరం వ్రాసాడు. దేనికి అంటే "నాకు పట్టాభిషేకము జరిగేటప్పుడు ఆవిడకు నమస్కారం పెట్టాలి.

కానీ ఆవిడ సముద్రము దాటి రారు కాబట్టి, ఆ సమయములో ఒక సోఫా వేసి, ఆవిడ ఫోటో అందులో పెట్టి, ఆవిడకు నమస్కారము పెట్టి అప్పుడు పట్టాభిషేకము చేసుకుంటా" అని వ్రాసాడు. తూర్పు గోదావరి జిల్లా కలక్టరు గారు ఫోటోగ్రాఫర్ ని తీసుకుని ఆవిడ దగ్గరకు వెళ్తే, "నేను ఈ సన్మానాల కోసం, ఫోటోల కోసం, నమస్కారాల కోసం అన్నదానం చెయ్యలేదు. విష్ణు మూర్తికి అన్నం పెడుతున్నాని పెట్టాను. దీనికి ఫోటోలు పట్టభిషేకలు ఎందుకు, వద్దు" అన్నారు ఆవిడ. "అమ్మ ఇది బ్రిటిష్ ప్రభువుల ఉత్తరం. మీరు తీయించుకోకపోతే నా ఉద్యోగం తీసేస్తారు" అని ఆ కలక్టరు గారు చెబితే, "నీ ఉద్యోగం పోతుంది అంటే, తీయించుకుంటా, నువ్వు అన్నం తినాలి" అని తీయించుకున్నారు ఆవిడ.

బ్రిటిష్ చక్రవర్తి నిజంగానే ఒక సోఫాలో ఆవిడ ఫోటో పెట్టి, నమస్కరించి, పట్టాభిషేకం చేసుకున్నాడు. ఆవిడకి పంపించిన పత్రం కూడా ఇప్పటికీ ఉంది. ఒక మనిషి నిస్వార్థముగా, ధృతితో, పట్టుదలతో లక్ష్య సిద్ధి కోసం పాటుపడితే, వారు ఎంత ఎత్తుకైనా ఎదుగుతారు, వారిని దైవం కూడా నిరంతరం కాపాడుతారు.డొక్కా సీతమ్మ గారి జీవితమే దీనికి నిదర్శనం.




**(బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారు సందేశంలోని అంశం)**

# తెర వెనుక 'నేను'




సినిమా వాళ్ళను తక్కువగా అంచనా వేయకండి.వాళ్ళు ఏదో ఒక రోజు మానవజాతికి శాసనకర్తలు అవుతారని జాన్ బెర్నార్డ్ షా చెప్పిన వాక్యం ఎన్టీఆర్, ఎంజీఆర్,జయలలిత,కరుణానిధి వంటి వాళ్లకు సరిపోతుంది.అలాగే తన చిత్రాల ద్వారా మనల్ని నిరంతరం నవ్విస్తూ మన బాధల నుంచి ఎంతో కొంత ఉపశమనం కలిగిస్తున్న సినీనటుడు బ్రహ్మానందం అటువంటి కోవకి చెందిన వ్యక్తి.ఇటీవల ఆయన 'నేను మీ బ్రహ్మానందమ్' అనే పుస్తకాన్ని మన ముందుకు తీసుకువచ్చారు.

బ్రహ్మానందం 1956 ఫిబ్రవరి 1న చాగంటివారి పాలెంలో నాగలింగం, లక్ష్మీనరసమ్మ దంపతులకు ఆరో సంతానంగా జన్మించారు. పేదరికం అనే పలకపై పాఠాలు దిద్దారు.'నా ఆశలు బడి వెంట పెడుతుంటే..నా ఇంట పేదరికం నన్ను చీకటి వాకిటి నిలబెట్టింది' అంటూ బ్రహ్మానందం చెప్పిన వాక్యాలు ఆయన చిన్నతనంలో ఉన్న పేదరిక పరిస్థితులకు నిదర్శనం. పశ్చిమగోదావరి జిల్లా అత్తిలిలో తెలుగు బోధకునిగా జీవితం ప్రారంభించేంతవరకు అష్ట కష్టాలు పగటిపూట నీడలా రాత్రిపూట చీకటిలా వెన్నంటే ఉన్నాయని చెప్పారు.


'అడుగు అడిగింది వెనకడుగు వేస్తావా అని..ఆశ బదులు చెప్పింది ముందడుగు తప్ప ఏది వేయకు అని' ఈ వాక్యం ఆయన దార్శనికత కి నిదర్శనం. తప్పనిసరి పరిస్థితుల్లో హైదరాబాద్ రావడం,ఈ.వి.వి గారి కంట్లో పడడం,శ్రీ తాతావతారంలో క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా జీవితం ప్రారంభించడం,తర్వాత "ఆహ నా పెళ్ళంట" చిత్రంతో విశేష గుర్తింపు పొందడం జరిగింది.ఇక అక్కడి నుంచి బ్రహ్మానందం జీవితం చూసిన చిత్రమే. చదువు కోసం పడరానిపాట్లు పడుతూ 12 కిలోమీటర్లు సైకిల్ తొక్కుతూ కాలేజీకి వెళ్లడం, లారీలకు పెయింటింగ్స్ వేయడం, మిమిక్రీ షోలు చేయడం ఇవన్నీ ఆయన పొట్టకూటి చేసిన ప్రయత్నాలు.

ఆకలి వేస్తుందంటే ఆహారం లేకపోయినా మనిషి 18 రోజులు బ్రతుకుతాడని తండ్రి చెప్పడం,తల్లి ఆరోగ్యం కోసం కొత్తగా పెళ్లయి ఇంటికి వచ్చిన భార్య నగలు తాకట్టు పెట్టడం వంటివి పాఠకులకు దుఃఖాన్ని కలిగిస్తాయి.

"స్థాయి అనేది కోరుకుంటే రాదు నేర్చుకుంటేనే వస్తుందని", "పేదరికం పెద్దరికం నేర్పుతుందని", "అవసరం అనవసరమైన ఆశలు పెంచుతుందని" బ్రహ్మానందం చెప్పిన ఈ మాటలు జీవితంలో ఎక్కడ ఎలా ఉండాలో మనకు నేర్పుతుంది.'అవసరం నన్ను ఎప్పుడూ దిగజార్చలేదు..అవకాశం నన్నెప్పుడూ గర్వించేలా చేయలేదు' వంటి జీవిత పాఠాలు కూడా ఉన్నాయి.

చార్లీ చాప్లిన్ లాగా తెలుగువారికి హాస్యాన్ని పంచే బ్రహ్మానందం జీవితంలో ఎన్నో సాధక బాధలు ఉన్నాయి.తన 65 ఏళ్ల జీవిత సారాన్ని ఒక గొప్ప పుస్తక రూపంలో తీసుకురావడం జరిగింది.నాలుగు దశాబ్దాలుగా వెండితెరపై గులాబీ నవ్వులు పూయిస్తున్న బ్రహ్మానందం జీవితంలోని గాయాల్ని,కంటి బాష్పాలని అక్షరాల రూపంలో మనం వీక్షించవచ్చు.ఒక గొప్ప నటుడు, కళాకారుడు, కళామతల్లి పెదవులపై చెరగని చిరునవ్వులా ఉండిపోయిన బ్రహ్మానందం జీవిత కథను ప్రతిఒక్కరూ చదవాల్సిందే.

**-బి.సుశాంత్ కుమార్**
**అనూర్ అలుమ్ని**




# బాల్యం - అమూల్యం

చాలా పెద్ద ఆఫీసు.అందులో నిజాయితీ గల మేనేజర్. ఆయన ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు, సంతకం చేసేటప్పుడు జేబులో నుంచి చిన్న ఫోటో తీసి చూసుకునేవాడు. అక్కడ ఉన్న ఉద్యోగులకు ఆ ఫోటోలో ఏముందో ఎవరికీ తెలియదు. దేవునిఫోటో అని, వాళ్ళ అమ్మ గారి ఫోటో అని, భార్య ఫోటో అని, ఏదో మంత్రమని... ఎవరికి తోచినట్లుగా వాళ్ళు అనుకునేవారు. కొంతకాలం తర్వాత ఆయన రిటైర్ అయ్యారు. సాయంత్రం వీడ్కోలు సభలో ఓ కుర్ర ఉద్యోగి ఉండబట్టలేక మీ జేబులోని ఫోటోలో ఏముందని అడిగేసాడు. ఆయన మాట్లాడుతూ మీ అందరికీ నా జేబులోని ఫోటో ఏమిటనేది చాలా ఆసక్తిగా ఉందని నాకు అర్థమైంది. ఏం లేదు. అది నా చిన్నప్పటి ఫోటో. బాల్యంలో ఏ మాయ,మర్మం, అన్యాయం, అవినీతి, మోసం, స్వార్థం... అంటే ఏమిటో తెలియకుండా జీవిస్తాం. ఎదిగే కొద్ది అవి మనల్ని కబళించి తమ వశం చేసుకోవాలని ప్రయత్నిస్తాయి. అందుకని కీలకమైన నిర్ణయాలు, సంతకాలు చేస్తున్నప్పుడు ఏ ప్రలోభాలకు లోను కాకుండా నా బాల్యం నాకు గుర్తు రావటానికి,అలాగే జీవించడానికి నా చిన్నప్పటి ఫోటోను నేను చూసుకుంటూ ఉండేవాడినన్నాడు.

అవును. జీవితమంటే చిన్న చిన్న ఆనందాలే. మాయ, మర్మం లేని పసితనాన్ని ఎవరూ మర్చిపోకూడదు. బాల్యమిచ్చే సందేశం కూడా అదే. ప్రస్తుతం అనే దానిలో మమేకమైన ఆనందాన్ని, నిజాయితీని నింపుకోవటమే బాల్యాన్ని కొనసాగించటం. బాల్యంలో మన నవ్వు హృదయములోంచి వస్తుంది. వస్తూ వస్తూ బండెడు ప్రేమను కూడా మోసుకొస్తుంది. నిష్కల్మషంగా పిల్లల్లా నవ్వాలంటే ఎవరికి వారు తమ పసితనాన్ని ఆవాహనం చేసుకోవాలి. బాల్యం ఒక పవిత్ర స్వర్గం. అమాయకమైన స్వప్నం. కాగితం మీద నిజాలని పోసి బొమ్మల్ని గీసే మర్మం లేని జ్ఞాపకం. బాల్యం ఎంత సరదా అయిందో బ్రతుకు కొన వరకు జీవితం కూడా అంతే సరదా అయింది. బాల్యం పరుచుకున్న ఒక నవ్వుల మైదానం. బడిలో, గుడిలో, అణువణువులో యధేచ్ఛగా, ప్రశాంతంగా విహరించే ఒక స్వేచ్ఛ! చిటికెన వేలు పట్టుకుని నడుస్తున్న చిన్నపిల్లవాడు చాలు... పిల్లల ప్రపంచం ఎంత మహత్తరమైందో చెప్పటానికి, సంతృప్తిగా ఆనందంగా జీవించటం అంటే ఏమిటో నిర్వచించటానికి.

**ఏదేమైనా... బాల్యం తిరిగిరాని అమూల్యం!!**

**- సంపాదకుడు**



# భద్రత చర్యలపై సమీక్ష సమావేశం



తూర్పుగోదావరి జిల్లా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో జిల్లాలో ఏడు శాసనసభ, రాజమహేంవరం పార్లమెంటు నియోజకవర్గాలకు చెందిన బ్యాలెట్, కంట్రోల్ యూనిట్స్, వివి ప్యాట్స్ భద్రత చర్యలపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె. మాధవీలత, జిల్లా ఎస్పీ జగదీష్ అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. దీనిపై కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ ఈవీఎమ్ లు భద్రపరిచే క్రమంలో కేటగిరి " ఏ " బి" యూనిట్స్ మరియు కేటగిరీ"సి' డి" లకి చెందిన యూనిట్స్ భద్రతపై ఎన్నికల కమిషన్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేసిందన్నారు. మూడు షిఫ్టుల్లో స్ట్రాంగ్ రూమ్ ల్లో బందోబస్తు, గెజిటెడ్ అధికారుల పర్యవేక్షణ, సీసీ కెమెరాలు నిఘా నిరంతర ఉండాలన్నారు. ఎస్పీ పి జగదీష్ మాట్లాడుతూ యూనివర్సిటీలో మూడంచెల భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. సర్కిల్ ఇన్స్పెక్టర్, డిఎస్పి , మొబైల్ టీమ్, సి ఆర్ పి ఎఫ్, ఆర్మ్డ్ రిజర్వ్ ఫోర్సెస్, రాష్ట్ర పోలీస్ యంత్రాంగం పర్యవేక్షణలో పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టామన్నారు. స్ట్రాంగ్ రూమ్ ల్లో కౌంటర్ పూర్తయిన వరకు 144 సెక్షన్ ఉంటుందని చెప్పారు. దీనిలో రిటర్నింగ్ అధికారులు రాజమండ్రి రూరల్ జాయింట్ కలెక్టర్ ఎన్ తేజ్ భరత్, రాజమండ్రీ సిటి మునిసిపల్ కమిషనర్ కే దినేష్ కుమార్, కొవ్వూరు సబ్ కలెక్టర్ అశు తోష్ శ్రీవాత్సవ్, రాజానగరం ఆర్డీవో ఏ. చైత్ర వర్షిణి, అనపర్తి ఎమ్. మాధురీ, నిడదవోలు ఎస్ డీ సి ఆర్ వి రమణ నాయక్, గోపాలపురం ఎస్ డీ సి కే ఎల్ శివ జ్యోతి, అదనపు ఎస్పీ లు ఎల్. చెంచి రెడ్డి, కే ఆర్ ఆర్ సి ఎస్ డి సి ఆర్. కృష్ణ నాయక్, డిఎస్పీ కే. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంసెట్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన వీసీ

రాజమహేంద్రవరం లోని రాజీవ్ గాంధీ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న ఎంసెట్ పరీక్షా కేంద్రాన్ని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య కె పద్మరాజు పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని పరీక్షల నిర్వాహకులకు సూచించారు.

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in